# టూ లేట్

పది రోజుల కంపెనీ పనిమీద కలకత్తా వెళ్ళి వచ్చేసరికి .... జానకి పెళ్ళి శుభలేఖ వచ్చివుంది! ఆశ్చర్యపోయాను! తెల్లబోయి చూశాను.

జానక్కి పెళ్ళా! తనకి తెలియకుండా, తనని అడగకుండానే! తనకి చెప్పకుండానే .... ఏమిటిది! ఎందుకిలా జరుగుతూంది! ఇంత తొందరగా జానక్కి సంబంధం ఎందుకు కుదుర్చున్నారు? కనీసం అమ్మవాళ్ళయినా రాయ లేదేమిటి?

అప్రతుతగా వరుడి పేరు చూశాను. ఎవడో బి. సూర్యనారాయణ, ఎవడయితే నాకెందుకు!

అసలిలా ఎందుకు జరిగిందన్నది నా బాధ! ఆలోచించి ఆలోచించి తల బ్రద్ద లయింది. ప్రయాణం చికాకుకి తోడు అదో చికాకు! సంగ తేమిటో తెలియని బాధ భరించరాని దయింది.

ఎల్లుండి రాత్రి పెళ్ళి! పెళ్ళికి వెళ్లాలా? ఎందుకు వెళ్లడం? నాకేం అవసరం! మాట మాత్రం అయినా చెప్పకుండా పెళ్ళి చేసుకుంటున్న వాళ్లింటికి నే నెందుకు వెళ్లాలి. పెళ్లికి ఒప్పుకునే ముందు ... కనీసం జాన కయినా ఓ ఉత్తరం ముక్క రాసి నీ అభిప్రాయం ఏమిటని అడిగితే ఎంత బాగుండేది! ఆ తర్వాత చేసుకోవచ్చుగా ఆ పెళ్ళి! కనీసం అమ్మ యిన నాన్నయిన రాయొచ్చుగా, వాళ్ళకి తెలియదేమో!

తలచుకున్న కొద్దీ ఒళ్ళు మండుతుంది. అందరి మీద కోపం వస్తూంది. ఏదో కసి, ఉడుకుమోత్తనం వస్తున్నాయి. మనసంత అవ్యక్త మైన బాధ నిండింది. ఎవరని ఏమనాలో, ఎవరిది తప్పో, ఎందుకిలా జరి గిందో, అన్న ప్రశ్నలు సందేహాలు, మనసుని పిండేస్తున్నాయి.

స్నానం అన్నా చేయకుండా అలా ప్రక్క మీద వ్రాలిపోయాను. పెళ్ళికి వెళ్ళ కుండా, అసలు సంగతి తెలియకుండా బాధపడుతూ కూర్చోడం కంటే వెళ్ళి సంగతి ఏమిటో తేల్చుకోడం మంచిదేమో! కష్టమైనా సంగతి తెలిస్తే భరించగల ననిపించింది.

ఎల్లుండి రాత్రి పెళ్ళి, రాత్రి ట్రెయిన్ ఎక్కితే ఎల్లుండి ప్రొద్దుటికి చేరగలను.! ఆ ఆలోచన వచ్చాక ఇంకా ఆలస్యం చేయలేదు.

రాత్రి ట్రైయిన్ ఎక్కాక మనసు కాస్త స్థిమితపడింది. ఆరాటం, ఆందోళన కాస్త తగ్గిన ట్లనిపించింది.

*   *   *

రిక్షా సందు మలుపు తిరగకుండానే బాజాలు గట్టిగా వినిపిస్తున్నాయి. రిక్షా దిగాను. పందిళ్ళు, రాటలు, రంగవాటికలు. చాందనీలు, కుర్చీలు అంతా అట్టహాసంగానే వుంది వీధి పందిరి.

పంట్లో స్నాతకం అవుతూంది నేను లోపలికి వెళ్ళేసరికి. హడావిడిగా తిరుగుతున్న మామయ్య నన్ను చూశారు. ఒక్క క్షణం మామయ్య మొఖం అదోలా అయింది. పైనున్న జరీకండువాతో మొహం తుడుచుకుంటున్నట్టు తన మొహం చాటు చేసుకున్నారు. నేను ముందుకు వెళ్ళడం చూసి, అప్పుడే, నన్ను చూసినట్టు ఆశ్చర్యంగా మొఖం పెట్టాడు. నవ్వాడు "ఏరోయ్ యిదేనా రావడం! .... నిన్న సాయంత్రానికి కూడా రాకపోతే యింక రావనుకున్నాం" అన్నాడు.

"రావనుకున్నాం" అన్న మాటలో ఎలా వచ్చావు అన్న అర్థం వినిపించింది నాకు.

"పద, పద లోపలికి వెళ్లి కాఫీ గట్రా తాగి స్నానం చెయ్యి"

అంటూ ఇంకో ప్రక్కకి వెళ్ళిపోయారు. నాలుగడుగులు వేశాను లోపలికి.

పందిట్లోంచి అమ్మ నన్ను చూసింది గాబోలు లేచి వచ్చింది.

"మురళీ వచ్చావా!" అంది .... తర్వాత నెమ్మదిగా "రా వనుకున్నాను" అంది.

"నాన్నగా రేదమ్మా!"

"రాలేదు, నేను ఒక్కర్తినే వచ్చాను ...." అంటూ నా మొహంలోకి అదోలా చూసింది.

ఇంతలో ఏదో పట్టుకుని అటు వెడుతున్న అత్తయ్య నన్ను చూసి గతుక్కుమంది! అందో లేక నా కలా అనిపించిందో! ఏమయ్యా వచ్చావూ!" అంటూ దీర్ఘం తీసింది.

నాకు వళ్ళు మండింది. అందరూ ఒకటే మాట! "వచ్చావూ" అంటూ, రా ననుకున్నారా, ఎందుకు రాకూడదూ! .... లేక ఏ మొహం పెట్టుకుని వచ్చావు అని అడగడమా ఇది! జానక్కి పెళ్ళవుతూంటే వోర్వలే ననుకున్నారా? చూసి ఏడ్చుకుంటా ననుకున్నారా?

వళ్ళు మండుతున్నా నవ్వుతూనే అన్నాను. "ఏం రావద్దనుకున్నారా? రాకూడదనుకున్నారా? రాలేననుకున్నారా" నవ్వుతూ అన్నా ఆ మాటల్లో వున్న కఠినత నాకే వినపడింది. అత్తయ్య మొఖం అదోలా పెట్టింది. "అయ్యో, రావద్దను కుంటే శుభలేఖ ఎందుకు వేస్తాం! నీ లాంటి పెద్ద ఆఫీసరు రాతగడానికి సరిపోరని నీ వనుకోవాలిగాని మేము ఎలా. అనుకుంటామయ్యా:"

"వోహో, నా ఆఫీసరుతనం ఇవాళ క్రొత్తగా తెల్సినట్టుంది!" ' శయ్యానికి కాలు దువ్వాను.

ఏమంది గాబోలు అత్తయ్య నవ్వేసింది. "పోట్లాటకి వచ్చినట్టు

న్నాడు వదినా మీ అబ్బాయి ....'' ఆడపడుచుకి ఫిర్యాదు చేసింది.

"పోట్లాటకి రావాల్సిన అవసరం వాడి కేమిటి వదినా !" అమ్మ అర్థ వంతంగా నా వైపు చూస్తూ అంది.

"సరే గానీ పదవోయి, కాఫీ అది త్రాగి స్నానం చేయి .... మీ అబ్బాయి సంగతి చూడవమ్మా వదినా, అంతా అయ్యాక యిప్పుడు మన వాదన ఎందుకు ?" గుంభనంగా అంది వెడుతూ అత్తయ్య.

అమ్మ నావైపు అత్తయ్యవైపు చూసింది "చూశావా ఆ మాటలు" అన్నట్టు. నాకంతా అయోమయంగా వుంది. ఇద్దరూ ఒకరినిమించి ఒకరు నిగూఢంగా మాట్లాడిన ఆ మాటల్లో నాక్కావలిసిన జవాబు ఏదీ దొరకలేదు.

"పదరా !" అంది అమ్మ లోపలికి దారితీస్తూ. నా పెట్టె, బెడ్డింగు చుట్టాలకి ఇచ్చిన గదిలో పెట్టించింది. ఇద్దరం వంట పందిట్లోకి వెళ్ళాం.

"పంతులు గారూ, కాస్త కలిపి ఇద్దురూ, మావాడొచ్చాడు యిప్పుడే !" వంటాయనతో అంది అమ్మ.

"తమరి అబ్బాయి గారా, ఏం చేస్తున్నారు ? ...." వంటాయన ప్రశ్నలు అమ్మ జవాబులు, ఏవీ నా తల కెక్కడం లేదు. నా కళ్ళు ఆరాటంగా చుట్టూ చూస్తున్నాయి. కావల్సిన మనిషి కనపడక నిరుత్సాహం వేసింది. "ఉప్మా వుంది, తింటావా ? చల్లారిపోయినట్టుంది ...." అమ్మ అడిగింది. వద్దన్నాను, అమ్మని అడగాలి ! ....ఇలా ఎందుకు జరిగిందో ... చుట్టూ మనుష్యులు .... ఎలా అడగడం. ?

"నిక్షేపంలాంటి మేనరికం వుండగా పై సంబంధం చేస్తున్నారేం...." వంట హెడ్డు గాబోలు సావకాశంగా కత్తి పీట ముందు కూర్చుని కూరలు తరిగి పోస్తున్నాడు.

"వుంటే మాత్రం అన్నీ జరుగుతాయా ? ఎవరికెవరు రాసి

పెట్టారో!" అమ్మ నా వైపు చూస్తూ అంది. నేను చూపులు తప్పించాను.

"స్నానం చేస్తానమ్మా చిరాగ్గా వుంది ...."

"పద!" అమ్మ నావెంట గదిలోకి వచ్చింది. పెట్టెలు, బెడ్డింగులు ప్రక్క చుట్టలతో గదంతా నిండి వుంది. పెట్టె తీసి బట్టలు సబ్బు వగైరాలు తీశాను. ఆ గదిలో ఎవరూ లేరు అమ్మ నడగడానికి ఇదే మంచి సమయం .... కానీ ....

"జానకేదమ్మా కనపడదు!" ఒకటి అడగాలని మరోటి అడిగాను.

"పెళ్ళి కూతురు గాదూ, స్నాతకం చూడకూడదు .... ఆ గదిలో ఎక్కడో కూర్చునుంటుంది" అమ్మ అటు ఇటు చూసింది నాదగ్గిరకి జరిగింది. "చూశావురా, ఏం చేశారో వీళ్ళు" రహస్యం చెప్పినట్టు అంది.

"ఏం చేశారు.?" ఏం తెలియనట్టు అమాయకంగా అడిగాను.

"ఏం చేయడ మేమిటి!? చిన్నప్పటి నించి జానకిని నీ కిద్దామనుకున్నది వాళ్ళూ మేము అనుకున్న మాట గదా! అసలు రెండు మూడేళ్ళనించి నీ వుద్యోగంలో చేరిందగ్గిర నించి ఎప్పుడు చేసుకుంటావు అంటూ పోరుతూనేవున్నాడు గదా! అలాంటిది ఉన్నట్టుండి ఇంకో సంబంధం చూసుకున్నారు. కుదుర్చుకున్నాక ఓ కార్డు ముక్క రాసి పడేశాడు మామయ్య. పోనీ ముందన్నా మీ అభిప్రాయం ఏమిటనయినా అడగలేదు సంబంధం చూసేముందు! .... పోనీ ఆడపిల్ల వాళ్ళకే అంత టెక్కయితే మనకేం? యీ మాత్రం సంబంధం మనకు దొరకదనా మనం బెంగెట్టుకోవాలి .... నా వళ్ళు మండిపోయింది సుమా! మీ నాన్నయితే అసలు నన్ను వెళ్ళద్దు అన్నారు పెళ్ళికి. ఎవరూ రాకపోతే మనమేదో ఏడుస్తున్నాం అనుకుంటారని వచ్చాను. అత్తయ్య మాటలు విన్నావా? పోట్లాటకి వచ్చావుట! పోట్లాటకి రావల్సిన అవసరం నీకేమిటి, యీ జానకిలాంటి వాళ్ళు లక్ష మంది దొరుకుతారు ...."

అమ్మ చెప్పిన అన్ని మాటల్లోనూ నా సందేహం తీర్చేది ఒక్కటీ లేదు. నా పజిల్ సాల్వ్ కాలేదు .... నిజమే, జానకి నాభార్య అని పుట్టినప్పటినించి మొన్నటి వరకు అందరూ అనుకున్నమాటే! అదీనాడు హఠాత్తుగా ఎందుకిలా తారుమారయింది ... అవాల్సిన అవసరం ఏం వచ్చింది? .... పోనీ యీ వరుడు నా కన్న పెద్ద ఉద్యోగస్థుడా, ఆస్థి పరుడా, అందగాడా! అంటే అదీ లేదు .... మరి?

"అది సరేనమ్మా, అసలు వీళ్ళిలా ఎందుకు చేసినట్లు? ...."

"అదేరా సరిగా తెలియడం లేదు .... నే నడిగితే మనమేదో జానకి కోసం కొట్టుకు పోతున్నాం అని అనుకుంటారని అడగలేను. వాళ్ళంత లెక్కలేనట్టుంటే మనమూ అలాగే వుండాలి! మీ అత్త, మామయ్య మాటలనిబట్టి "ఎన్నాళ్ళుంచుతాం పిల్లని" అంటూ ఏదో మాట్లాడారు, ... ఆ మాట అర్థం ఏమిటో నాకు బోధపడలేదు ...."

"జానకే మనలేదా, వప్పుకుందా!" ఆత్రుతగా - అడిగాను.

"అసలు జానకి పట్టుదలవల్లే ఈ పెళ్ళి జరుగుతూందట .... సూరమ్మ దొడ్డమ్మ అంది. "బావతప్ప ఇంకే"మగాడు లేడా నన్ను పెళ్ళాడడానికి" అందిట జానకి వాళ్ళమ్మతో."

"నిజంగా .... జాన కందా అలా!" తెల్లబోయాను.

"ఊఁ .... అందుకే మామయ్య వెంటనే పై సంబంధం చూశాడట,"

"ఏమే సుబ్బులూ మురళి వచ్చాడుట ఏడి? ...." మా దూరపు వరస బంధు వొకావిడ గదిలోకి రావడంతో సంభాషణ ఆగిపోయింది. ఆవిడ నన్ను నఖశిఖ పర్యంతం పర్యవేక్షించింది. జీతం వగైరాలు ఆరా తీసింది. విసుగ్గా వున్నా బాగుండదని ఓపిగ్గా చెప్పాను జవాబులు.

"అదేమిటే! సుబ్బులూ నిక్షేపంలాంటి మేనరికం వదిలి పై సంబంధం చూశాడు రాముడు .... రాజాలాంటి మేనల్లుడు ...."

మెల్లిగా జారుకుని బాత్‌రూమ్‌లోకి జొరపడ్డాను. స్నానం చేస్తున్నంత సేపూ నా మనసు మనసులో లేదు .... అమ్మ చెప్పిన మాటలు విన్నాక నా సందేహం తీరకపోగా మరిన్ని ప్రశ్నలు పుట్టాయి. జానకి వేరే సంబంధం చూడమందిట ! బావతప్ప మరో మగాడు లేడా అందిట! జానకి ... జానకలా ఎందుకు అంది? హఠాత్తుగా జానకిలా ఎందుకు మారింది ! చిన్నప్పటినించి అందరూ అనుకునే మాట కాస్త జ్ఞానం వచ్చిం దగ్గిర నించి ఇద్దరం వింటూనే వున్నాం. అందరూ మొగుడు మొగుడు అనడం అది సిగ్గు పడడం నాకు తెల్సు ! అలాంటిది హఠాత్తుగా జానకి నన్ను మొగుడిగా అంగీకరించక పోవడానికి కారణం ఏమిటో ? అకస్మాత్తుగా నా మీద అయిష్టత ఎందుకొచ్చింది ! అందరికి రాజాలా కనిపిస్తున్న నాలో ఏం లోపం కనిపించి ఇంకొకరిని వెతుక్కుంది ! జానక్కి నేనంటే ఇష్టం లేదన్నట్లు యిప్పటి వరకు ఏ సందర్భంలోనూ నాకు తెలియదు. పైగా నేనంటే ప్రేమాభిమానాలు, గౌరవం ఉన్నట్లే అనేక సందర్భాలలో వ్యక్త పరచినట్లు గుర్తు. .... మరి హఠాత్తుగా ఎందుకిలా నిర్ణయం చేసుకుంది ? .... పోనీ ఏ ప్రేమ వ్యావహారమో అనుకోడానికీ లేదు .... మామయ్య కుదిర్చిన సంబంధమే ఇది ! ...."

వళ్ళు రుద్దుకోకుండా నీళ్ళన్నీ పోసేసు కుంటున్నానన్న సంగతన్నా గుర్తు రాలేదు బాల్చీలో నీళ్ళన్నీ ఆఖరయ్యే వరకు ....

ఇదేమిటో జానకినే అడగాలి ! నన్నింత అవమాన పర్చడానికి కారణం ఏమిటో జానకినే అడగాలి! అవమానం కాదూ ! చిన్నప్పటినించి అనుకున్నది. ఉద్యోగంలో ప్రవేశించిం దగ్గిర నించి రోజుకో ఉత్తరం రాసి ప్రాణం తీసేవాడు మామయ్య. ఇంచు మించు జానకి నా భార్య అయి పోయిందన్న దృష్టిలో ఉన్న నన్ను ... యిలా యీనాడు .... నేనేదో చచ్చుదద్దమ్మని, చాత కాని వాడిని అన్నట్టు నన్ను కాదని యింకొకరిని

చేసుకుంటుందా ? మగాడన్న వాడికి యింతకంటె అవమానం యింకేం కావాలి ! నేను చేసిన నేరం ఏమిటి !....

మొహం మీదే అడిగి తేల్చు కుంటాను.

ఆవేశంగా గబగబ వళ్ళు తుడుచుకుని బట్టలు కట్టుకుని పైకి వచ్చాను — గదిలోకి వెళ్ళి తల దువ్వుకున్నాను .... గదుల్లో ఎవరూ లేరు. అంతా వీధి పందిట్లో చేరారు ఇదే సమయం !

నెమ్మదిగా గదులన్నీ వెతుక్కుంటూ మామయ్య కచేరిగదిలోకి వచ్చాను. జానకుంది అక్కడ. చుట్టూ పెట్టెలు, ప్రక్క చుట్టల మధ్య పెట్టె మీద కూర్చుని ఏదో వార పత్రిక చదువుతూంది. ప్రొద్దుటే పెళ్ళి కూతుర్ని చేసినట్టున్నారు తలంటుకుని వదులుగా వేసికున్న జడ, తలనిండా పూలు, కళ్యాణం బొట్టు, కాళ్ళకి పారాణి, కళ్ళకి కాటుక మొహంలో ఏదో కాంతి " పెళ్ళికళ " అంటే ఇదే గాబోలు ! ఎంత అందంగా వుంది! యీ! అందం .... యీ ఆనందం .... అంతా నాకు సంబంధించినది కాదు గదా! జానకి ప్రక్కన పెళ్ళి కొడుకుగా కూర్చోవలసిన నేను .... పరాయి వాడిలా ఎదుట నిలబడ్డాను. నాకేమిటో దిగులు అనిపించింది. నే నెవర్ని యిక్కడ ? ఎందు కొచ్చాను యిక్కడికి ? సిగ్గు లేకుండా .... పౌరుషం, అభిమానం లేకుండా యీ పెళ్ళికి ఎందుకు వచ్చినట్లు ? వెంటనే జానక్కి కనపడకుండా వెనక్కి తిరిగి పారి పోవాలనిపించిది .... కాని మనసులో ఏమూలో అసలు సంగతి తెల్సుకోవాలన్న కుతూహలం నన్ను కదలనీయ లేదు .... మరో అడుగు ముందుకు వేశాను .... నా పిచ్చిగాని యిప్పుడు అసలు సంగతి తెల్సుకుని మాత్రం ఏం చేయ్యాలని నా ఉదేశ్యం ! ఇంకో కొన్ని గంటల్లో శాశ్వతంగా పరాయిదయి పోతుంది జానకి, ఇంక యిప్పుడు కారణం తెల్సుకుని .... ఏం చెయ్యగలను! ఇదేం సినిమానా పీటలమీద పెళ్ళి కొడుకుని లేవదీసి నేను కూర్చోడానికి!

ఎటూ తేల్చుకోలేని స్థితిలో అలాగే వుండి పోయాను. అంతలో చివుక్కున తలెత్తింది జానకి. నన్ను చూసింది. ఒక క్షణం బిత్తరపోయింది, మొహం నల్ల బడింది? బహుశ తన పెళ్ళికి నేను వస్తానని అనుకుని వుండదు .... ఏదో తప్పు చేసిన దానిలా తలవంచుకుని నిలబడింది. ఇంక వెనక్కి వెళ్ళే ఉపాయం లేక ముందుకే అడుగేశాను .... అలా ఇద్దరం ఒకరి కెదురుగా మరొకరం నిలబడ్డాం కొన్ని నిమిషాలు ! ఆ సన్నివేశం ఇద్దరికీ ఇబ్బందిగానే వుంది. ఆఖరికి జానకే తలయెత్తి చిరునవ్వు నవ్వింది. "ఎప్పుడొచ్చావు బావా ! " అంది అతి మామూలుగా, ఆ ప్రశ్నకి జవాబు అనవసరం.

'జానకీ !' అన్నాను. నా గొంతులో భావం కనిపెట్టి జానకి కలవర పడ్తూ చూసింది. అటుప్రక్కకి. ఆమె చూపుల ననుసరించి నేనూ చూశాను. ఆ గదిలో వున్నది మే మిద్దరమే గాదు ! ఎవరో ఆమె అటు తిరిగి కూర్చుని వళ్లో చంటి బిడ్డకి పాలిస్తూంది. నయమే అను కున్నాను. గొంతులో ప్రశ్నని మళ్ళీ లోపలికి పంపేశాను.

'కూర్చో బావా' అంది జానకి. పట్టి పట్టి చూస్తున్న నా చూపులని తప్పించు కుంటూ ఎటో చూస్తూంది జానకి. బరువుగా గడుస్తున్నాయి నిమిషాలు.

"ఉద్యోగం బాగుందా ! హైదరాబాదు మారుస్తారని విన్నానే...." జానకే నయం, ఏదో ఒకటి మాట్లాడుతుంది. జానకి ప్రశ్నలకి జవాబీయాల్సింది లేనట్లు ఆ గదిలోంచి ఆమె వెళ్ళడం కోసం ఆత్రుతగా చూస్తున్నాను.

"ఏం బావా మాట్లాడవు? అమ్మ నాన్న నీవు రావడం చూశారా? అత్తయ్య వచ్చింది చూశావా?" తలూపాను.

అమ్మయ్య! ఆమె పిల్లాడిని పడుకోబెట్టి గదిలోంచి వెళ్ళిపోయింది. భారం దిగినట్టు నిట్టూర్చాను. ముందుకి వంగాను.

"జానకి!"

జానకి అడగబోయేదానికి సిద్ధ పడ్డట్టు సర్దుకు కూర్చుని ధైర్యంగా మొహంలోకి చూసింది.

"జానకీ, ఏమిటిది?...."

"ఏమిటి బావా!" నవ్వింది.

"అదే దీనర్థం, ఏమిటి? ఎందుకిలా చేశావని అడుగుతున్నాను...." నా కళ్ళు నాకు తెలియకుండానే ఎర్రబడి వుంటాయి. మాటల్లో కఠినత్వం వచ్చింది.

"ఏం చేశాను బావా?" అమాయకంగా మొహం పెట్టింది. ఆమె కళ్ళల్లో ఇందాకటి కంగారు, బెదురు లేదు. కొంటెగా మెరుస్తున్నాయి.... ఆమె పెదవుల్లో చిన్న నవ్వు తొంగిచూస్తుంది. ఆ నవ్వులో ఏదో సాధించా నన్న గర్వం తొంగిచూస్తున్న భావం కనిపిస్తూంది.... నా వళ్ళు మండింది ఆ మొహం చూస్తూంటే.

"జానకీ, నటన చాలు ... జవాబు చెప్పు!"

అదే చూపుతో, అదే నవ్వుతో తల ఎగరేసింది జానకి. "ఏం అడుగు తున్నావో తెలియకుండా జవాబేం చెప్పను బావా!" అంది.

నన్ను రెచ్చగొడ్తూంది. ఏం తెలీనట్టు నటిస్తూంది. స్పష్టంగా నా నోట "నన్నెందుకు పెళ్ళాడడంలేదు" అని అడిగించాలని చూస్తూంది. అంత తేలిగ్గా బైట పడతాననుకుంటూంది గాబోలు.... ఘాటుగా దులిపేద్దా మని నోరు తెరిచాను.

"అమ్మా, తల్లీ, పెళ్ళికూతురా, ఇక్కడా వున్నావు... వెతికి వెతికి చస్తున్నాం...." అంటూ వో అరడజనుమంది అమ్మాయిలు, స్నేహ బృందం గాబోలు బిల బిలలాడుతూ లోపలికి వచ్చారు.

ఆ క్షణంలో నాకెంతో కోపం వచ్చింది. దాంతోపాటు ఏదో నీరసం, నిస్పృహ వచ్చాయి. బయటకు వెడుతూ ఒక్కసారి జానకి మొహం లోకి చూశాను. వాళ్ళతో మాట్లాడుతూనే జానకి నావంక చూస్తూంది.... యిప్పుడు ఆ చూపులో ఇందాకటి కొంటెతనం, గర్వం లేదు. అస్థానే ఏదో బాధో—తొందరపడ్డానేమోనన్న పశ్చాత్తాపమో, తప్పుచేస్తున్నాననన్న భావంతోనో మలినపడినట్లనిపించింది.... కేవలం నా ఊహేమో! తల త్రిప్పుకుని గబగబ వెళ్ళిపోయాను.

ఆ పగలంతా ఎన్నివిధాల ఎన్నిసార్లు ప్రయత్నించినా జానకిని వంటరిగా పట్టుకోలేక పోయాను. సంగతి తెల్పుకోవాలన్న నా ఆఖరి కోరికకి స్వస్తి చెప్పక తప్పలేదు.

రాత్రి జానకి శాశ్వతంగా పరాయి దయి పోయింది. జానకి మెడలో అతను మూడు ముళ్ళు కడుతూంటే ఏదో పోగొట్టుకున్నా నన్న భావం నన్ను కృంగదీసింది. అందరితోపాటు ఇన్ని అక్షింతలు ఇచ్చారు ఎవరో. నా మనసులో కోరికలు, ఆశలు లాగే నాచేతిలోంచి అవి నాకు తెలియ కుండానే జారిపోయాయి.

ఆ రాత్రే ప్రయాణం అయ్యాను, ఎవరు చెప్పినా వినకుండా! అవును, ఇంకేముంది అక్కడ నాకు!

* * *

చాలా రోజుల తర్వాత.... జానకి పెళ్ళయి రెండేళ్ళపైన అయింది. ఏడాది కూతురు తనకి, అమ్మ వాళ్ళ ద్వారా అప్పుడప్పుడు సంగతులు

వినడంతప్ప నేను తర్వాత జానకిని చూడలేదు ...

జానకీ పెళ్ళయ్యాక "రాజా" లాంటి నాకు చాలా సంబధాలే వచ్చాయి! ఏం ఎందుకు రావు? అంతో ఇంత చదువు, మంచి ఉద్యోగం వున్న మొగాడికి సంబంధాలకేం కొదవ! కానీ....ఏమిటో.... యింకా ఈ రాజాగారి జీవితంలోకి ఇంకా ఏ రాణిగారూ ప్రవేశించలేదు.

మెడట్లో జరిగిన పరాభవాన్ని దిగమింగడంతో గడిపాను.

మరి కొన్నాళ్ళు ఏదో నిర్లిప్తత ఆవహించి వెనక్కి పెట్టాను పెళ్ళి. ఇంట్లోవాళ్ళ బలవంతం వల్ల చూసినవి కొన్ని నాకు నచ్చక, కొన్ని వాళ్ళకే నచ్చక... అలా అయి ప్రస్తుతం ఇంకా వంటరిగానే మిగిలాను.

ఆ రోజు....శలవురోజు! ఏం తోచలేదు ... బయటికి వెడదామంటే వర్షం! క్రొత్త పుస్తకాలు కనబడలేదు.... పేపరన్నా రాలేదు ఆరోజు టైము ఎలా గడపాలో తెలియక పుస్తకాల అలమారా వెతికాను ...ఏదన్నా చదవనిది కనపడదాని!.... చూస్తూంటే 'తెగిన తీగలు' అన్న పుస్తకం కనపడింది. అది నాది కాదు! ఎలా వచ్చిందో అంతకంటే గుర్తులేదు.... అసలు నాకు తెలుగు పుస్తకాలు చదివే అలవాటు లేదు. బహుశా శారద దయి వుంటుంది. ఆర్నెల్ల క్రితం పురిటికి ఇంటికి వెడుతూ మధ్యలో నాదగ్గిర వోరోజు ఆగి వెళ్ళింది. మర్చిపోయి వుంటు.ని బహుశా, అల మారాలోకి ఎలా వెళ్ళిందో!

సరే, కాలక్షేపానికి ఎలా వుంటుందో చదివి చూద్దా మనిపించింది. పేజీలు జరుగుతూంటే పరవాలేదనిపించింది....హీరో, హీరోయిన్ల చిన్న తనం రోజులు చదువుతూంటే జానకి హఠాత్తుగా గుర్తు వచ్చింది....జానకి నేను....ఎంత వద్దనుకున్నా ఆ రోజులు కళ్ళ ముందు మెదిలాయి. నిట్టూర్చాను.

పుస్తకం సగం చదివేసరికి... హఠాత్తుగా యిన్నాళ్ళ నించి నన్ను వేధిస్తున్న సమస్యకి మెరుపులా జవాబు తట్టింది. ఆ క్షణాన ఆ కథలో నాయిక స్థానంలో జానకి నిల్చుంది... సందేహం నివృత్తిఅయింది.

జానకి నన్ను కాదనడానికి ఇదేనాకారణం! ఇంతే అయివుంటుంది బహుశా! ఎంత పొరపాటుగా అర్థం చేసుకుంది నన్ను జానకి! ఎంత తొందరపడింది.

జానకి నన్ను అపార్థం చేసుకుంది. జానకి అలా ఆలోచిస్తుందని నే నూహించలేక పోవడం నా తప్పేనేమో! పొరపాటుపడ్డానేమో! తెగే వరకు లాగాను తాడు.

....నిజమే!

జానకి నిశ్చయంగా నాదే అన్న నమ్మకంతో, జానకిగాని, మామయ్యగాని నన్ను కాదనరన్న నిబ్బరంతో జానకి మనసుతో, అభిమానిని అయిన జానకితో చెలగాటం ఆడాను! .... చెలగాటం అని యిప్పు డను కుంటున్నాను. కాని అప్పు డది వినోదం!

పదిసార్లు అడిగించుకుంటూ, అడిగిన దానికి తిన్నగా సమాధానం యీయకుండా వాళ్ళని సందిగ్ధావస్థలో పెట్టి, ఇరకాటంలో పెట్టి వాళ్ళ మొహాలు చూసి మనసులో ఆనందించే వాడిని.

పాపం మామయ్య నేను ఉద్యోగంలో ప్రవేశించిందగ్గిరనించి వారానికో ఉత్తరం రాసేవాడు. శలవలకి వెళ్ళినప్పుడల్లా 'ముహూర్తం ఎప్పుడు పెట్టించ మంటావు!' అంటూ వేధించేవాడు. రెండేళ్ళు ఏది తిన్నగా చెప్పకుండా, డొంకతిరుగుడు సమాధానాలు చెప్పి తప్పించు కునే వాడిని వో రెండేళ్ళు మూడేళ్ళు కాలయాపన చేయాలన్నది నా ధ్యేయం.... దానికి కారణాలు వాళ్ళకి చెప్పకుండా ఏవేవో చెప్పి వాళ్ళని ఏడిపించే వాడిని.

వో సారి మామయ్య గట్టిగానే నిలేశాడు .... 'ఏరా, ఎన్నాళ్ళు యిలా అడిగించు కుంటావు....ఏదో ఒకటి చెప్పు ... నీవు చేసుకుంటావా దానికి వేరే సంబంధం చూసుకోమంటావా!' అప్పటికి వో పదిసార్లయినా యీ విషయం ఎత్తిన మామయ్య ఆ రోజు కాస్త గట్టిగానే అడిగాడు.

'వో . చూసుకో .... చూసుకో .... నేను కాక మరింకెవరు నీ కూతుర్ని పెళ్ళాడుతారో నేనూ చూస్తాను....పోనీ ఏదో మామయ్యవు.... బ్రతిమిలాడుతున్నావు గదా అని ఆలోచిస్తున్నాను....' పోజుపెట్టి అన్నాను. జానకి తలెత్తి తీక్షణంగా చూసింది. ఉడుక్కుంటూందని నవ్వు కున్నాను మనసులో.

'పోనీలేరా, దానికి తగ్గవాడు దానికి వస్తాడులే ...' నవ్వుతూ అన్నా మామయ్య మాటల్లో నిష్ఠూరం వినిపించింది.

'ఆ చూడు, తగ్గ వాడిని ! నన్నెందుకు యిలా బాధపెడతావు.... వచ్చినప్పుడల్లా పెళ్ళి, పెళ్ళి అన్నమాట తప్ప ఇంకోటి మాట్లాడరు.... అలా అయితే రానే రాను....చూడు బాబూ సంబంధం చూడు....అలా అయినా కొన్నాళ్ళు నా జోలికి రావు.... అప్పటికయినా నీ కూతురికి నేను తప్ప మరోడు దొరకడని తెలుసుకుంటావు....' పెళ్ళికొడుకు దర్పంతో టెక్కుగా అన్నాను.

'ఒరేయ్ .. నిజంగానే అంటున్నావా?....' మామయ్య గాభరా....

'వూరుకోండి, అతనేదో తమాషాగా అంటూంటే....' అత్తయ్య నమ్మకం.

జానకి చివుక్కున లేచి లోపలికి వెళ్ళిపోయింది. జానకి మొహం చూస్తూ బాగా ఏడిపించానని సంతోషించాను.

'కట్నం కావాలేమో అల్లుడికి....' అత్తయ్య ఎలాగైనా నా మనసులో ఉద్దేశం లాగాలని ప్రయత్నిస్తుంది.

'ఏం వద్దేమిటి? మేనల్లుడు గనక ఎగవేద్దా మనుకుంటున్నారులా వుంది. కుదరదు. పదివేలు కూడ పెట్టాల్సిందే...' అలా ఏ సంగతి తేల్చి చెప్పకుండా మాట తేల్చేసి నవ్వులాటలోకి దింపేవాడిని. మామయ్య ఇంకేమనాలో తెలీక విసుక్కుంటూ లేచి వెళ్ళిపోయాడు.

మర్నాడు ఉదయం నా గదిలోకి వచ్చింది జానకి. మామయ్య ఆఫీసుకి, అత్తయ్యవంటింట్లోనూ. పిల్లలు స్కూలుకి వెళ్ళారు. వస్తూనే తిన్నగా నా ఎదుట నిల్చుంది. రోజులా బాతాఖానీకి రాలేదని తెలుస్తూంది ఆ మొఖం చూస్తూంటే.

'బావా!' అంది అదోలా సీరియస్‌గా, "ఓయ్!" అన్నాను రోజు లాంటి హాస్యధోరణిలో.

"నిన్ను ఓ సంగతి అడగాలని వచ్చాను" "ఓ అడుగు, వొక టేం ఖర్మ ఓ వందో లక్షో అడుగు!" నవ్వుతూ పుస్తకం ప్రక్కన పెట్టి తలగడామీద చెయ్యి ఆన్చి శేషశాయిలా విలాసంగా పడుకున్నాను.

"హాస్యంకాదు....సరి అయిన జవాబు చెప్పాలి"

"బాగుంది అడగకుండానే ఏం జవాబు చెప్ప మంటావు? ఇంతకీ దేవిగా రివాళ ఈ అపరకాళికా అవతారం ఎందుకు ఎత్తినట్లు...తమరు ముందుగా కుర్చీలో ఆసీనులయి చెప్పరాదా....అలా నిలబడితే నాకాళ్ళు నొప్పెడుతున్నాయి...."

జానకి కళ్ళు నవ్వబోయి మానేశాయి..."బావా!" అంది మాటలకి తడుముకుంటూ.

"బావ" సహస్ర నామార్చన పూజచేస్తున్నావేమిటి!" హాస్యం ఆడాను, "అదికాదు....నీవు....నేనంటే...."

జానకి ఏం అడగడానికి వచ్చిందో అర్థం అయింది నాకు. అలా జానకిని చూస్తుంటే ....చిన్నప్పటిలా .... పలకపుల్లలు దాచి, పుస్తకాలు చింపేసి, చేసిన లెక్కలనిండా ఇంకు పులిమి మేష్టరు చేత చివాట్లు తినిపించి .... ఆటల్లో చేరకోకుండా ఏడిపించి .... జడపట్టుకుగుంజి.... రకరకాల ఏడిపించడాలుచేసి జానకి మొహం చూస్తూ ఘనకార్యం చేసినట్టు ఫీలయ్యే అప్పటి నాటి ప్రవృత్తినాలో తొంగిచూసింది ఆక్షణాన....

'నీ కంటే....' రెట్టించాను.

'ఇష్టముందా లేదా... ఒక్కమాటలో చెప్పాలి జవాబు!' సూటిగా చూస్తూ అడిగింది.

"బాగుంది... ఇష్టమంటే ఇష్టంలో ఎన్నిరకాలు!....నీకు వేగోడీలు ఇష్టమా కాదా అన్నంత సుళువుగా...."

నా జవాబు పూర్తి అయ్యే లోపలే అత్తయ్య క్రిందనించి కొంప మునిగినట్టు కేకలు పెట్టసాగింది. పాపం అత్తయ్యకి జానకి, నేను ఒంటరిగా రెండు నిమిషాలుంటే అనుమానం! నాజవాబుకి ఆరాటంగా కొన్నిక్షణాలు ఎదురు చూస్తూ నిల్చిన జానకి అంతకంతకి అత్తయ్య పిలుపులు ఎక్కువవడంతో వెళ్ళిపోక తప్పలేదు. తరువాత మళ్ళీ మధ్యాహ్నం నాచేత జావాబు చెప్పించడానికి ప్రయత్నించింది. నే నెక్కడ అంత సుళువుగా దొరుకుతాను! అంత సులభంగా బైట పడతానా!

ఆ కలవల తర్వాత.... నెలా పదిహేను రోజులకే పెళ్ళి శుభలేఖ....హు....జానకెంత తొందరపడింది! నా జాప్యాన్ని మరోలా అర్థం చేసుకుంది!

ఉద్యోగంలో ప్రవేశించి కొత్త కాలు చెయ్యి కూడదీసుకోకుండానే పెళ్ళేంటి! జానకి ఎక్కడికి పారిపోతుంది! కొత్త ఇంటికి కావల్సినవి, నాహోదాకి సరిపడినట్టు నాలుగు అమర్చుకోకుండా పెళ్ళాడేస్తే....తర్వాత

ఇంక నాలుగు అమరడం ఉత్తమమాట! క్రొత్తపెళ్ళాంతో షికార్లు తిరగడానికి కారు లేకపోయినా కనీసం స్కూటరయినా వద్దా! ఇవన్నీ అమరడానికి కనీసం రెండేళ్లు కావాలి! మామయ్య మేనల్లుడేగదా అని ఇంటరు చదువుతో చాలించి కూతుర్ని అంట గట్టేద్దామన్న ఎత్తులో ఉన్నాడు! నా పెళ్లానికి డిగ్రీ వుండకపోతే ఎలా? అందుకే బి. ఏ. లో చేర్పించమన్నాను ... రెండేళ్లు మూడేళ్ళు ఆగితే నాకోరికలన్నీ తీరుతాయి.... అంతేకాక నాకొచ్చే ఆరువందలపైభై బొంబాయిలాంటి మహాపట్నంలో ఏమూల? మాకంపెనీ బ్రాంచి హైద్రబాదులో పెడ్తారని, ఏరియా మేనేజరుగా నన్ను వేస్తారని వార్తలు.... నేననుకున్నవి అన్నీ జరగాలంటే పెళ్ళి తప్పకుండా రెండు మూడేళ్ళు వాయిదా వెయ్యాలి!....

అప్పట్లో నా ఊహలని ఉన్నదున్నట్టు చెప్పకుండా పెళ్ళికొడుకు ఠీవి చూపిస్తూ వాళ్ళందరిని సందిగ్ధంలో పడేసి వినోదించడం.... కాలయాపనకి మాత్రమే! నాఆలోచనలని ఎవరికి చెప్పక పోవటం నాతప్పేనేమో!

ఇప్పుడింక ఎవరికి చెప్పాలి! సంజాయిషీ ఎవరడిగారు?

ఆపెళ్ళినాటి జానకి కళ్ళలో గర్వానికి అర్థం ఈ నాడు బోధపడింది దేబ్బ తీశానని, బదులు చెప్పానని ... ఆ చూపులకి అర్థం!

ప్చ్! జానకి ఎంత పొరపడింది! ఎంత తొందరపడింది! లేదు.... లేదు.... నేను తొందరపడలేదు ... అదే అనర్థం అయింది.

ఇప్పుడింక ఏం లాభం?....

"టూలేట్" నిట్టూర్చాను.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక'70)